క్లుప్తంగా

స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పామూరు: మండలంలోని స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి పేర్కొన్నారు. ఈసందర్భంగా గురువారం గ్రీన్ అంబాసిడర్స్‌తో కలిసి వారికి రావాల్సిన పెండింగ్ వేతనాలు మంజూరు చేయించాలని ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేయగా త్వరలో వేతనాలు మంజూరయ్యేలా చూస్తామని ఎంపీడీఓ హామీఇచ్చారు. సీఐటీయూ నాయకులు అల్లాబక్షు, గ్రీన్‌అంబాసిడర్స్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గుడ్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను కందుకూరు సెబ్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట గ్రామం దగ్గర ఉన్న ఉప్పుటేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న సెబ్ ఎస్సై మౌళాలి సిబ్బంది తో కలసి స్వర్ణాజీపురం క్రాస్ రోడ్డు వద్ద ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని గుడ్లూరు పోలీసులకు అప్పగించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ రెడ్డి తెలిపారు.

1889 బేళ్ల కొనుగోలు

కందుకూరు: కందుకూరు పొగాకు వేలం కేంద్రాల్లో గురువారం జరిగిన పొగాకు వేలంలో 1889 పొగాకు బేళ్లను విక్రయించారు. వీటిలో కందుకూరు-1లో 1010 బేళ్లను వేలానికి ఉంచగా 902 బేళ్లు, కందుకూరు-2 వేలం కేంద్రంలో 1085 బేళ్లు వేలానికి ఉంచగా 987 బేళ్లను విక్రయించారు. రెండు వేలం కేంద్రాల్లో అత్యధిక ధరలు వరుసగా రూ.270, రూ.271, అత్యల్ప ధరలు రూ.160, రూ. 151లుగా నమోదయ్యాయి.

1093 పొగాకు బేళ్ల కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం పొందూరు క్లస్టర్ రైతులు 1,141 బేళ్లు తీసుకురాగా 1093 కొనుగోలయ్యాయి. 48 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.270, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.251.79 పలికింది. వేలంలో మొత్తం 37 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పారదర్శకంగా ఓట్ల సర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవరావు

టంగుటూరు: బీఎల్వోలు పారదర్శకంగా ఓట్ల సర్వే చేయాలని తహసీల్దార్ సంజీవరావు అన్నారు. స్థానిక 1వ సచివాలయంలో గురువారం బీఎల్వోలకు ఓటర్ల జాబితా సవరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఓటరుకు డోర్ నంబర్ కచ్చితంగా ఉండాలని, దొంగ ఓట్లు తొలగించాలని స్పష్టం చేశారు. అనంతరం ఓట్ల సర్వేపై పలు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనాథ్, ఈఓఆర్డీ నర్రా జగదీష్‌బాబు, బీఎల్వోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాభ్యాసన సామగ్రి అందజేత

సీఎస్‌పురం (పామూరు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సాయంగా దాతలు విద్యాభ్యాసన సామగ్రి అందజేత అభినందనీయమని ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఎంఈఓ జె.ప్రసాదరావు అన్నారు. సీఎస్‌పురం ఎస్టీకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠశాల హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఎస్‌పురంకు చెందిన దాత పూల రసూల్ తన సొంతనిధులతో పాఠశాలలోని 88 మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, కాపీరైటింగ్, పెన్నులు, పెన్సిల్స్, స్కేల్స్ అందజేశారు. పొట్టేండ్ల మాలకొండయ్య, తోట శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి పింఛను సొమ్ము అందజేత



రాధమ్మకు నగదు అందజేస్తున్న తన్నీరు సుబ్బారావు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఆంజనేయనగర్‌లో నివసిస్తున్న సుంకేశుల రాధమ్మకు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఇచ్చిన హామీని నెరవేర్చారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా రాధమ్మ ఇంటి వద్దకు వెళ్లారు. ఆమెకు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు లేవని తెలిసి సచివాలయ సిబ్బందికి చెప్పి వెంటనే కార్డులు మంజూరు చేయించారు. ప్రభుత్వం నుంచి పింఛను మంజూరయ్యే వరకు ప్రతి నెలా రూ.2,750 ఇస్తానని ఇచ్చిన హామీ మేరకు గురువారం ఆయన పంపిన డబ్బును పార్టీ జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు అందజేశారు. చుక్కా అశోక్, మిడసల జెస్సీపాల్, తన్నీరు వినోద్, షేక్ కాలేషా, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ చక్రవర్తి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష చారిత్రాత్మకం

- ప్రజల అవసరాలను సకాలంలో పరిష్కరించిన గొప్ప కార్యక్రమం
- నియోజకవర్గంలో 84,687 ఇళ్ల సర్వే, 66,849 పత్రాల పంపిణీ
- అర్హులందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందించడమే లక్ష్యం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాలను సకాలంలో అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష పథకం ఓ చారిత్రాత్మకమని, నెల రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో పూర్తిగా విజయవంతమైందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది ఈ పథకాన్ని పకడ్బందీగా నిర్వహించారని, రాష్ట్రంలో 1.46 కోట్ల కుటుంబాలను సర్వే చేశారని వివరించారు. ప్రజల సమస్యలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించడమే లక్ష్యంగా కార్యక్రమం సాగిందని వివరించారు. జూలై 18న 70,054 పత్రాలను ఒకేరోజు మంజూరు చేసి చరిత్ర సృష్టించారన్నారు. వీటి ద్వారా సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడం సులభం అవుతుందని చెప్పారు. నేరుగా ఇళ్ల వద్దకే అధికారులు వెళ్లి సమస్యలు పరిష్కరించారని, కలెక్టర్ హరిహరన్ ఆధ్వర్యంలో అధికారులు బాగా పని చేశారని కొనియాడారు.

నియోజకవర్గంలో 84,687 ఇళ్ల సర్వే

నియోజకవర్గంలో సురక్ష పథకం కింద 84,687 ఇళ్లను సర్వే చేశామని, 67,813 మంది పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే 66,849 మందికి పత్రాలు మంజూరు చేశామన్నారు. నియోజకవర్గంలో 99శాతం పూర్తి చేశామని, మిగిలిన 1 శాతం నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాల్సిన సమస్యలున్నాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ పథకం పెద్ద ఎత్తున ఉపయోగపడిందని, ప్రభుత్వ పథకాలకు ఎక్కువ మంది లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారని, ఇప్పటికే చుక్కల భూముల సమస్యను పరిష్కరించారన్నారు. అలాగే సర్వీసు ఇనామ్ భూముల సమస్యలను పరిష్కరించి హక్కులు కల్పించారని చెప్పారు. అలాగే త్వరలో భూ పంపిణీ కార్యక్రమం ప్రారంభించనున్నారని, నియోజవకర్గంలో ఇప్పటికే 70 పేర్లను పరిశీలిస్తున్న వివరించారు. అలాగే కందుకూరు పట్టణంలోని కొన్ని పట్టా భూములను దేవాదాయశాఖ అధికారులు దేవదాయశాఖ భూముల ఖాతాల్లో చేర్చడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశామని తెలిపారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రోడ్ల మరమ్మతులకు నియోజకవర్గానికి రూ.3 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. వీటితో చినపవని నుంచి అన్నెబోయినపల్లి, పోట్లూరు నుంచి పాజర్ల, పామూరు రోడ్డు నుంచి పోలినేనిపాలెం, వలేటివారిపాలెం నుంచి రామచంద్రాపురం, గుడ్లూరు నుంచి అడవిరాజుపాలెం వంటి తదితర రోడ్లను మరమ్మతులు చేస్తామన్నారు. అలాగే తిమ్మారెడ్డిపాలెం నుంచి అయ్యవారిపల్లె వరకు రూ.7కోట్లతో నూతన రోడ్డు నిర్మాణం జరగనుందని చెప్పారు. అలాగే తెట్టు నుంచి రామాయపట్నం రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా మార్చేందుకు కేంద్ర డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించిందన్నారు. రూ.20కోట్లతో నిర్మించనున్న విక్కిరాలపేట రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభమవుతాయని చెప్పారు. ఇక పట్టణంలో 40వ్యాపార దుకాణాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, వీటిలో ఇప్పటికే రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మాణం పూర్తి అయ్యాయని వివరించారు.

తల్లిపాలు అమృతంతో సమానం



తెట్టు సచివాలయంలో కిట్లు అందచేస్తున్న ఎంపీపీ, అధికారులు



అమ్మపాలెంలో కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఓబులుకొండయ్య



పలుకూరులో పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్ ప్రభావతి

పామూరు: అమ్మపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంపీఎస్ పార్వతి అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పామూరు 2వ వార్డుతోపాటు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించి వారికి పౌష్టికాహారం పంపిణీచేసి అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సాఆర్‌సీపీ మైనారిటీ నాయకుల, ఎంపీటీసీ షేక్.అబ్దుల్, అంగన్‌వాడీ కార్యకర్త వంకేశ్వరం వెంకట నాగవాణి తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: తల్లిపాలు చిన్నారులకు దేవుడిచ్చిన వరమని సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రావడానికి ఇబ్బందులు పడుతుండటంతో ఇంటి వద్దకే కిట్లను అందజేస్తున్నామన్నారు.

వలేటివారిపాలెం: తల్లి పాలు బిడ్డకు శ్రేష్టమని సీడీపీఓ షర్మిలా అన్నారు. మండలంలోని అమ్మపాలెం, పోలినేనిపాలెం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు సునీత, లలిత కుమారి, సర్పంచ్‌లు చన్నిబోయిన ఓబులు కొండయ్య, అనుమోలు అమరేశ్వరి, ఏఎన్‌ఎమ్‌లు రాజేశ్వరి, విజయ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరు: బిడ్డకు తల్లిపాలు అమృతంతోసమానమని ఎంపీపీ రమేష్ అన్నారు. మండంలోని తెట్టు గ్రామ సచివాలయంలో తెట్టు సెక్టార్ పరిధిలో గురువారం సూపర్‌వైజర్ కామేశ్వరి అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ విజయకుమారి, సర్పంచ్ జయమ్మ, హెల్త్ సూపర్‌వైజర్‌సారమ్మ, వైఎస్సా ర్‌సీపీ మండల మీడియా కన్వీనర్ బిళ్లారమణయ్య, పంచాయతీ కార్యదర్శి ఇష

కందుకూరు రూరల్: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టకరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతి సూచించారు. మండలంలోని పలుకూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు తప్పకుండా పట్టించాలన్నారు. పిల్లలను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపణీ చేశారు.

వెలిగండ్ల: తల్లిపాలు అమృతంతో సమానమని జిల్లా ఎస్‌బీసీసీ కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్ అన్నారు. తల్లిపాల వారోత్సవాలను గురువారం మండలంలోని తాడివారిపల్లి, మొగళ్లూరు, బూడిదపాలెం అంగన్‌వాడీ కేంద్రాలల్లో వెలిగండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. వెలిగండ్ల ప్రాజెక్టు కోఆర్డినేటర్ గంధం సామ్యూల్, ఎస్‌బీసీసీ సెల్ జిల్లా సభ్యులు, గుడ్‌హెల్ప్ రమేష్ బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, తల్లులు పాల్గొన్నారు.

పొన్నలూరు: మండలంలోని చెరుకూరు అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు సర్పంచ్ కాలే అయ్యన్న చేతుల మీదుగా అందజేశారు. శిశువు పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల ఆరోగ్యకరంగా ఉంటారని అంగన్‌వాడీ కార్యకర్త సుజాతరాణి సూచించారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

మర్రిపూడి: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సుచరిత పేర్కొన్నారు. మండలంలోని కెల్లంపల్లి సచివాలయం పరిధిలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలు తాపించాలని, తద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఏఎన్‌ఎం బుజ్జమ్మ, పీఎంసీ చైర్మన్ వీరబద్రయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



పామూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది



చెరుకూరులో పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న సర్పంచ్ అయ్యన్న



కెల్లంపల్లిలో బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుచరిత

సమస్యలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

హనుమంతునిపాడు: వీఆర్వోలు సచివాలయ పరిధిలో రైతులకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ఎస్.హరిబాబు అన్నారు. వీఆర్వోలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి ఓటర్ల తనిఖీ కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని బూత్ లెవల్ అధికారులకు సూచించారు. స్పందనలో వచ్చిన అర్జీలు, కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉన్న వెంటనే పరిష్కరించాలన్నారు. భూముల ఆన్‌లైన్, పట్టాదార్ పాస్ పుస్తకాలు, కుల, ఆదాయం, తదితర సర్టిఫికెట్లు పెండింగ్ లేకుండా చేయాలన్నారు. వీఆర్వోలు కాశీమ్ ఫిరా, శ్రీనివాసులరెడ్డి, బాదుర్లు, వెంకటస్వామి, వెంకటనర్సయ్య సుబ్బయ్య పాల్గొన్నారు.

స్థలం హక్కుదారులను తేల్చాలని వినతి

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ టీపీ నగర్ సర్వే నెంబర్ 737/540 సర్వే నంబరులో 34 సెంట్ల స్థలానికి సంబంధించి నిజమైన హక్కుదారులను తేల్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రావినూతల కోటిమాదిగ గురువారం తహసీల్దార్ సీహెచ్ ఉషకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఆ స్థలాన్ని ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన పాలకీర్తి కుమారి కొనుగోలు చేసిందని, అయితే ఆ స్థలంపై వివాదం తలెత్తిన నేపథ్యంలో రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు నిర్మాణ బాధ్యత క్వారీ యజమానులదే

- ఆర్డీఓ అజయ్‌కుమార్
- భారీ గ్రానైట్ లారీల తరలింపుతోనే రోడ్డు ఛిద్రం
- నిబంధనలు ఉల్లంఘించిన క్వారీలపై చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ అజయ్ కుమార్

కనిగిరి రూరల్: భారీ గ్రానైట్ లారీలు తరలించడం వల్లే శంఖవరం లింకు రోడ్డు ఛిద్రంగా మారి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆర్డీఓ తోట అజయ్ కుమార్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, చైర్మన్ అబ్దుల్ గఫార్, పలువురు అధికారులు, క్వారీ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ గ్రానైట్ క్వారీల నుంచి భారీ లోడుతో లారీలు తరలిస్తుండటం వల్లే రోడ్డు సమస్య తీవ్రమైందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పొల్యూషన్‌ను నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత క్వారీ యజమానులదే నన్నారు. శంకవరం లింకు రోడ్డు అభివృద్ధికి గ్రానైట్ క్వారీ యజమానులు పూర్తి బాధ్యత వహించి, నెల లోపు తగు నివేదికతో రోడ్డు అభివృద్ధి చేపట్టాలని ఆదేశించామన్నారు. మున్సిపాలిటీ, మండల పరిధిలో ఎన్ని క్వారీలున్నాయి, వాటిలో ఎన్నింటికీ మున్సిపల్, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల అనుమతులున్నాయనే దానిపై ప్రత్యేక బృంద, ద్వారా విచారణ అధికారులను నియమిస్తున్నట్లు చెప్పారు. కాలుష్య నివారణకు ఆయా గ్రానైట్ కంపెనీ యజమానులు తీసుకుంటున్న చర్యలను గూర్చి నివేదికలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. గ్రానైట్ క్వారీల యజమానులు నిర్లక్ష్యం వహించినా, తగు నివేదికలను సమర్పించక పోయినా, కాలుష్య నివారణ చర్య ల్లో భాగంగా రోడ్డు అభివృద్ధి నులు చేపట్టక పోయినా చర్యలు తీసుకుంటామన్నారు. నీరు, విద్యుత్ సమస్యలను ఆయా శాఖాధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, తహసీల్దార్ యుపుల్లారావు, రమేష్, జయవర్ధన్ పాల్గొన్నారు.

శంఖవరం రోడ్డుకు అభివృద్ధి పనులు



శంఖవరంలో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాలతో శంఖవరంలో తక్షణం అభివృద్ధి పనులు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్ అన్నారు. పట్టణంలోని 3వ వార్డు శంఖవరంలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ శంఖవరం లింకు రోడ్డు అభివృద్ధికి త్వరలో శాశ్వత పరిష్కారం చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాజకీయ లబ్ధి కోసం స్వార్థపరులు చెప్పే మాటలు ఎవ్వరు వినవద్దని సూచించారు. స్థానికులు విన్నవించిన సీటీ, విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారానికి ఏఈ కోటేశ్వరరావు, విద్యుత్ సిబ్బందిని పిలిపించి ఆదేశాలిచ్చారు. వార్డు కౌన్సిలర్ పెన్నా ఏడుకొండలు, నాయకులు మీరావలి, బాలకృష్ణారెడ్డి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఎస్‌కే షరీఫుద్దీన్, శానటరీ సెక్రటరీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మొబైల్ రేషన్ పంపిణీని చైర్మన్ అబ్దుల్‌గఫార్ తనిఖీ చేశారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడిన, అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో కోదండరామస్వామి కల్యాణం



కోదండరామస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పామూరు: మండలంలోని వీరభద్రాపురం బీసీకాలనీలో కోదండరామస్వామి శాంతి కల్యాణోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సోమరాజుపల్లి శివకామేశ్వరరావుశర్మ సీతా రామ, లక్ష్మణ, హనుమంతుని మూల విగ్రహమూర్తులకు, ఉత్సవమూర్తులకు తొలుత పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం స్వామివార్ల ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ వేడుకగా ఎదురుకోల నిర్వహించి కల్యాణ మండపానికి చేర్చి రుత్వికులు మధు, సందీప్‌ల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం సాయంత్రం మేళతాళాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ పువ్వాడి మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సర్పంచ్ పువ్వాడి జయమ్మ, దనెంకుల రవి, పువ్వాడి చినలక్ష్మయ్య, జొన్నలగడ్డ గోవిందయ్య, బైరబోయిన శ్రీనివాసులు, పంగా నారాయణ, మితికాల నారాయణ, ప్రహ్లాద, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

- రూ.4కోట్లతో పట్టణ శివారు ప్రాంతాల్లో విద్యుత్ ఆధునీకరణ
- చైర్మన్ అబ్దుల్ గఫార్



విలేకర్లతో మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణ శివారు ప్రాంతాలైన కాశీపురం, కాశిరెడ్డి కాలనీ, మాచవరం, చింతలపాలెం గ్రామాల్లో సుమారు రూ.4 కోట్లతో విద్యుత్ ఆధునీకరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 5వేల జనాభా కంటే అధికంగా శివారు ప్రాంతాలను ఎంపిక చేసుకుని విద్యుత్ ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఒక్కో గ్రామాన్ని ఒక్కో యూనిట్‌గా తీసుకుని, యూనిట్‌కు సుమారు రూ కోటితో విద్యుత్ అభివృద్ధి పనులు చేపడతారని చెప్పారు. కాశిరెడ్డి కాలనీ, కాశీపురం, మాచవరం, చింతలపాలెం గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్‌కు బదులు ఇకపై పూర్తిగా 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తారని తెలిపారు. 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను తీసేసి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తారన్నారు. పట్టణంలోని అర్బన్ కాలనీలో సుమారు రూ.2 కోట్లతో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం తుది దశకు వచ్చిందని, సుమారు రూ.50 లక్షతో మాచవరం సబ్‌స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరిగాయని, కందుకూరు రోడ్డులో మరో కొత్త సబ్‌స్టేషన్ మంజూరైందని తెలిపారు. పట్టణంలో అన్ని వార్డుల్లో విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో కందుకూరు రోడ్డులో నూతన సబ్‌స్టేషన్‌కు ఎమ్మెల్యే బుర్రాతో శంకుస్థాపన చేయిస్తామని చెప్పారు.

రేషన్ షాపుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి

- 77 బస్తాల బియ్యం సీజ్.. కేసు నమోదు



స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కొండపి: మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలోని 29వ నంబర్ రేషన్‌షాపు మీద ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడి చేశారు. షాపులోని 77 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి సీహెచ్ కృష్ణమోహన్ తెలిపిన సమాచారం మేరకు.. కె.ఉప్పలపాడు గ్రామంలోని 29వ నంబర్ రేషన్‌షాపులో అధికంగా బియ్యం నిల్వ ఉంచి అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈమేరకు దాడులు నిర్వహించగా షాపులో ఉండాల్సిన స్టాకు కంటే 36 బస్తాలు అధికంగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. దీంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసి, 77 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి గ్రామంలోని 25వ నంబర్ దుకాణానికి అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో ఒంగోలు డీటీ ఆర్‌వీఎస్ కృష్ణ మోహన్, ఎఫ్‌ఐ యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పన్నూరు భూములపై ఆర్డీఓ విచారణ



పన్నూరు గ్రామ రైతులను విచారిస్తున్న కనిగిరి ఆర్డీఓ అజయ్‌కుమార్

మర్రిపూడి: మండలంలోని పన్నూరు రెవెన్యూ పరిధిలో అదే గ్రామానికి చెందిన ఉమ్మడి భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆ గ్రామస్తులు ఇటీవల కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కనిగిరి ఆర్డీఓ అజయ్‌కుమార్ విచారణ చేపట్టారు. గురువారం మర్రిపూడి తహసీల్దార్ కార్యాలయానికి ఆర్డీఓ వచ్చారు. పన్నూరు గ్రామానికి చెందిన 30 మంది రైతులకు 14 సర్వే నంబర్లలో 150 ఎకరాల ఉమ్మడి భూమి ఉంది. అయితే ఈ భూమిని పన్నూరు వీఆర్‌ఓ డి.శివారెడ్డి తమ బంధువుల పేరుతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని జూలై 27న కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్డీఓ అజయ్‌కుమార్ ఒక్కో రైతును స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి పిలిచి విచారించారు. ఎఫ్‌ఎల్‌ఆర్ దాఖలా ప్రకారం ఆ భూమిపై 28 మంది హక్కుదారులుగా ఉన్నారు. వారి వారసులుగా 67 మందిని రెవెన్యూ అధికారులు గుర్తించారు. రైతులతో విచారించిన అనంతరం ఆర్డీఓ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ భూమిపై ఎలాంటి లావాదేవీలు నిర్వహించకుండా హోల్డ్‌లో పెట్టామన్నారు. ఎలాంటి పక్షపాతంలేకుండా పూర్తి స్థాయిలో విచారించి సర్వే చేయించి, నిజమైన హక్కుదారులను గుర్తిస్తామన్నారు. ఎవరి పేర్లతో జాయింట్ పట్టా నమోదై ఉందో వారందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా న్యాయం చేస్తామన్నారు. రైతులు ఇష్టపూర్వకంగా భూములు అమ్మారా? లేదా వీఆర్‌ఓ శివారెడ్డి ఉద్దేశపూర్వకంగా తన బంధువులకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడా? అనే విషయమై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. అక్రమాలకు పాల్పడినట్లు తేలితే పట్టాలు రద్దు చేసిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణారావు, డిప్యూటీ తహసీల్దార్ జగదీష్ రావు, రైతులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో ఆదివాసీలపై దాడి తగదు



శాంతియుత ర్యాలీలో బీఎస్పీ నాయకులు, పాస్టర్లు

కొండపి: మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీలపై దాడులను ఖండిస్తూ బహుజన సమాజ్‌వాదీ పార్టీ, నియోజకవర్గ క్రైస్తవ పాస్టర్ల ఐక్యవేదిక సంయుక్తంగా గురువారం కొండపిలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి పరంజ్యోతి మాట్లాడుతూ.. మణిపూర్‌లో క్రైస్తవ ఆదివాసీలపై నరమేధానికి ప్రధాన కారణం బీజేపీయేనని ఆరోపించారు. ఇటువంటి సంఘటనలను ఖండించకుండా టీడీపీ, జనసేనలు పరోక్షంగా మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో కొండపి ఇన్‌చార్జి కాకి ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు పేరం సత్యం, జిల్లా అధ్యక్షులు టి వెంకటస్వామి, రాజశేఖర్, నియోజకవర్గంలోని పలువురు పాస్టర్‌లు పాల్గొన్నారు.